# మోనా

అక్కా!

నీవేమొ పాండవుల నాటి పాతాళలోకంల, పగటి దీపాలు ఎలిగే సోట వుంటివి; మరి నీకు ఇక్కడి ముచ్చెట్లన్ని పూసగుచ్చాల్నంటె నాతరమా? అది ఈనాడు మనూరి సాహిత్యపు, సబకూ, మిర్ప గుడ్డెంల కలుపుకూ మందిని కూడ గొట్టినంతపని. ఉత్తురం ల ఈ రొండు మాటలు బావకండ్ల వడ్డవి అంటె నీకాటికె కండ్లు ఆయిన ఎదకు కలువ తోరణాలు గట్టంగ కొత్తగ వెంచిన కత్తెర మీసం మీదకి సేయివోనిచ్చి -

''అబ్బ ! ఎన్నాళ్లకెన్నాళ్లకు ? మా అమ్మ తోడేసిన మీగడ పెరుగు అసొంటి మాటలు యినవడ్తిఅనుకుంట నీమిసిమి మీగెళ్లె తొలుతజు(రుకోగలడు బద్రం.

అక్కా! ఇది నగువాట్ల ఉత్తురం గాదు, గుండె పదిలంజేస్కోని నీవూ బావ కలి సేసదువుండి.

అక్కా! పాపమో ? పుణ్యమో ? గని మనకు తూర్పున మిత్తిద్యావరనెత్తి ఇరవోసు కోని బరి బత్తల నిలవడి ఆకలో! అన్నమో! అంట గొంద్లిదొక్కిందంట. కాలదేవుడు కన్నుగీటంగ, గాలిదేవుడు వొరసెలివినగంగ వానదేవుడు వరం ఇచ్చిండు.

ద్యావరకు బోనాలరాసులు తీరాలపొంటి కుప్పతిప్పలుగ కూర్నయి. అసలు తల్లి కడుపుల ఇకారమే పుట్టొద్దుగని, పొడసూపిన ఇకారాన్ని పసిగట్టిన బంట్లు రెప్ప పాటున అమరిచ్చి పెట్టరా? మరి?.

మొన్న మూడుదినాలు మొగులు చిల్లివోయినట్ల, ముంతన గుమ్మరిచ్చినట్ల, మిన్నూ మన్నూ కలపి ఏకంగవొడికినట్ల ఏకసిస్తుగ ఒకటే వాన. వొ(రెలు, వొంపులు, కాల్వలు, మడుగులు, కుంటలు, చెర్లు, ఏర్లు, నదులు అన్ని నీళ్లునిండంగ పిక్కటిల్లి, గండ్లు వడి, కట్టలు దెంపుకోని, ఏకమైవొడ్లెక్కి, అలుగులుదుంకి, చిన్నా

పెద్దతారతమ్యాలు డిగి, మిర్రు పల్లాలు ఒకటై, వొంపులు దీరి, ఈసురోసాలు ఇడ్సి, ఒక్కబాటగా, ఒక్కసూటిగా, జత జతగా, కలెగల్సిగా సముద్రయ్య దిక్కునడ్సినయ్.

వొచ్చిండు జతగాడు గాలిద్వావర, పొత్తుగలసి, సత్తువజూపి మెప్పుల పత్కం పొందుతనంట. ఏం జవం? ఏం పొగురు? వుండదామరి? అయ్య ఆసరతోటి కండబలం పుంజుకొన్న కొలువుగానికి పట్టపగ్గాలేయి?

అడ్డమొచ్చిన కొండలయ్యల చెంపలు సర్సి, తరాలనాటి చెట్లను వూడవెర్కి కుంచెలోలె సేతులవట్టుకోని తక తక తైతై తకథిమి తఝుణం ఝణం అంటుంటె, ఆదరవు ఎంబడి వొనరాశి అంత బొంగరమోలె తిర్గి తిర్గి సెముటోడ్సి అలిసి, సొలసి న్యాలకు వొర్గింది. అక్కరకు బుజంగల్సిన జతగాణి నడ్క మెప్పుకు ఎక్కింది.

వస్తున్న నీళ్లమ్మను జూసిండు సంద్రయ్య.

గుటికిళ్లుమింగిండు సముద్రయ్య - వువ్విళ్లూరిండు సముద్రయ్య
పులకించిండు సముద్రయ్య - పోకలువోయిండు సముద్రయ్య
మీసందువ్విండుసముద్రయ్య - పైవెంచిండు సముద్రయ్య
పకపక నగిండు సముద్రయ్య - ఉర్రూతలూగిండు సముద్రయ్య

వూగడా ? మరి కాంతమ్మను జూడ కనకమ్మను జూడ బెమ్మకైన బుట్టు రిమ్మ తెగులు అంట నిట్టూర్పులు నిగుడంగ నిలువెల్ల చేతులు జేస్కోని నీళ్లమ్మలను అదుమకున్నడు.

చెంపా చెంప, చేయి చేయి గల్సి అంతతానేఐండు. సంబురం తట్టుకోలేక కడలయ్య తడలు మిన్ను ముట్టినయ్. ఆ తాకుడుకు నీళ్లల్ల నిప్పు మొలిసింది. నింగి దీపాలు ఆర్పి నల్ల దుప్పటివర్సింది.

ఉట్టిఊగినట్లూగింది భూదేవి.
తండ్లాడింది భూమాత తల్లడిల్లింది బూతల్లి
ఆవలీవలవడ్డది భూమమ్మ- అంగలార్సింది బూలచ్మి

పడదా మరి? గుత్పచేతులున్నోడు పాలకి ఎక్కినా, పాకోళ్లు దొడ్గినా మోసేది కిందోడేగద!

అయ్యో గాలి! అబ్బో దుమ్ము! దుమారం, పదుండి లోపలికి, మూయుండి

తలుపులు, దేవుడా! ఎగురుతుండయి కప్పులు, పోతుండయి నెత్తి నీడలు!

అమ్మో! నీళ్ళ, ఏమయ్యో! లేసిరా!చెల్లే బిరానవుర్కు,
అన్నా! అవ్వవడ్డది; పిచ్చన్నా! పసుల దిక్కుసూడకు,
నా తల్లే! నాసంటిది తొట్లెల సిక్కువడ్డది. నేనిడ్సి రాను,
కూటి గింజలు ? మనం మిగిల్తె గదనే గింజా గట్కా అంట పోట్టాపతి.
అమ్మో! మంటలు! కాదు ఉప్పెన! ఎనుదిర్గి సూడకు, ఉర్కు!
అదో గుడి, ఇదో బడి, ఎగవాకు మీదికి,
అమ్మో! నాశాతగాదు! సీతా! బావా! నాయినా! అమ్మో! పాము.
అబ్బో పరిక్కంప, అయ్యో! ఎద్దుకొమ్ము డొక్కలపొడ్సింది.
అన్నీ నీళ్లు, అంతసీకటిమయం, మళ్ళా పొంగు!
యావి నీళ్లు ? యాది బూమి ? యాది గుడిసె, యాది గడ్డి, యాదికూడు

యాది కన్ను ? యాది ముక్కు ? ఎవరి బిడ్డ ? ఎవరి తల్లి ? ఎవరి పెండ్లం ? ఏది సిగ్గు ? యాండది దాపు ? ఎవడు దొంగ ? ఎవడు దొర ?

గొడ్డూ గోదా, వురుగూపుట్ర, గడ్డీ గాదం, ఈగె, బల్లి, పాము తేలు, ఎడారొచ్చు, ఆడీ మొగ, రోగి రొష్టు, పసి పడ్డు, ముది ముత్క అంత వొక్కటె సకట్టు.

ఇట్లా మిత్తి తల్లికి పెంటి, పోతురూపాన, వొచ్చిన వుప్పెన కాలం దీరిన జీవాలను ఖవట్టి, సిగెవట్టి, తోకవట్టి, ఈకెవట్టి, చెవువట్టి, ఈడ్సి, కాళ్లిర్సి, డొక్కలు సీరి, దేవి, కండలుసెండి, నెత్తురు వొడిపి, కలెగూర బోనం గూర్సి తీరాన్ని ఊడ్సి పెట్టింది.

తన్క జరుగాల్సిన తతంగం, మొదలైంది. వాళ్ల ఎతలన్ని కతలోలె అప్పుడు.

వాళ్లు వూడ్సుకపోంగ మిగిలిన మందికి అది సుకమో దుక్కమోదెల్వ ...టి ఎదలు గూడ ఎండిపోయినట్లు, బిగిసి కరుడు గట్టినట్ల కండ్ల నీళ్లు ...ట్టి వోయినట్లైనయి.

...మ ప్రాణాలకు ప్రాణంగ తీపులో... ...న్నపుట్టుకలు వుత్త మాంసపు

ముద్దలోలె, బొక్కలగూళ్లోలె మురిగి చీకిముర్గకంపు తోటి నడిచి వొచ్చిన నర్కం తీర్గ కండ్లవడ్తుంటె తమ బతుకే తమకు వోమోపై నోళ్లు ఏంజేస్తరు ?

ఇసొంటోళ్లందరిని మనోండ్లు శాతనైన కాడికి ఆదుకుంటనే వుండరు.

అక్కా ! ఇందాక  ఉప్పెన దెబ్బ ఎసొంటిదో చెప్పిన ఇంగ ఇప్పుడు నేను జెప్పేది ఉప్పెన ఎంట వుట్టిన ఉపద్రాలకు నిలువుటద్దం బట్టే కత సదువు.

అక్కా !  నీకు మోహన  ఎర్కే  అనుకుంట ! అదే మనం ' మోన ' అంట విలుస్తుంటిమి. నీ పెండ్లిల్ల మంగళార్తివట్టింది. నీకుదాన్నిజూసినట్లయాదికి వుండదో ? లేదో ? గని, అది శనా ముద్దుగుంటది. దాన్ని జూసి అందరు తీరొక్క మాటలన్నరు.

అది వొయ్యారాలు నింపినగాదె; జాణతనంల కరిగి, నాట్కంలవుడికి ఇసంతోటి మెరుగచ్చిన కత్తి . కత్తి మెర్పుల సొంటి దానిరొండు కండ్లు తళ తళ లాడంగ ! వోరసూపు జూస్కుంట ఎడ్మసేయి పందిరికొమ్మకు ఆనిచ్చి నగింది అంటే అబ్బో అప్పుడు ఆనగుల పూలు వుట్కలు నింవుకోను దౌడుదీయని మొగదీరు డే కరువు.

దాని కాళ్ల గజ్జెలు గలగల మని నాదిచ్చుకుంట జక్కు జూపింది అంటే మంచి మైన మొగ గుండెకాయలన్ని  వానకాలం ల వుసిళ్ల తీర్గ దాని కాళ్లముంగల కు గూలాల్సిందే !

'మోన సింగారపు కాకకుమైన మోలె కరిగి పారని మొగతనం యాాండదీ ? అ ఇట్లా ఎన్నెన్నో తీర్ల ఆడిపోసు కున్నరు.

ఇసొంటి తెరకెక్కిన బొమ్మ వున్నట్లుండి వోనాడు ఎకాఎకిన కొచ్చింది. మంది జెప్పు కుంటున్న మోనకు నేను జూస్తున్న ఈ మో సింతాకంత గుడ పొంతన కుదుర్తలేదు. ఈమోన యిష్ణుమూర్తి తో ల లక్షిందేవి తీర్గ గానొచ్చింది.

' మోన కండ్లు చాపలోలె చపులంగ లేవు,  ఇప్పుకున్న తామర గున్నయ్, కొలుకులు ఎర్ర వారి కానొచ్చినయ్.

అందరినోట్ల తలో తీరుమెదలే మోన నాకాడికి వొచ్చుడు నాకిష్ట జొచ్చుకొచ్చిన మనిషిని మెడలువట్టి పొమ్మనలేం, పల్కరిచ్చుకుండవు ఎందో ? పెదవులా సరకు మాట్లాడినట్ల -

‘ ఏం మోనమ్మ ? ఇట్లొస్తివి? ఏందో సంగతి ? అంట నేను అంటుండంగనె మాట అందుకోని

‘ఏం లేదక్కా ! మొన్నటి వొరుదలల్ల ఇండ్లకు ఇండ్లు, ఊళ్లకు వూర్లు, గొట్క పోంగ అంత దుంపనాశనమాయెగద ! మరి అందర్ని వోగొట్టుకోని నా అన్నోండ్లు లేక సావ జాలక బతికిన పిల్లల గతి ఏందో ? ఏమైందో ? అంట నిన్నడిగి తెల్సుక పోద మంటొచ్చిన ’ అని ఏందో ? చెప్పలేని ఎతతోటి కుములుతున్నట్లు, పుట్టెడు దుక్కాన్ని దిగమింగి మీదికి మట్టుకు గంబీరంగ వల్కుతున్నట్లు గా నొచ్చింది.

అయినగని నాకండ్లెదుట చూస్తున్నా, సెవులతోటి ఇంటున్నా నాకండ్లనూ, నాచెవులను నాకే నమ్మ బుద్ధిగాలే.

‘అమ్మో ! మంది అంటున్నది నిజమే ! తంతులమారిగాకపోతే ఏంది? ఏందో ? ఎత్తు ? ఈ వన్నెల బొంగురానికి ? కడాకు ఈతల్లికిగుడ దిక్కులేని బక్క ప్రాణాలే గావాల్సివొచ్చె, ఏందోగురి. యా. ఏం. ఎల్యేతక్తు బ్యారానికోసూటివెట్టినట్లుం డది తల్లి; అవును ఈ కాడ్కి పొడి పొడిమూడక్షిరాలెందుకు ? గుండుగ మంత్రి అంటె సరిపోతుండె గద ! అంట నామనుసుల అనుకోని ఎటుకారం పల్కులల్ల పసరు అల్కంగ.

‘ఏం ? మోనా ! సూపు అటుదిక్కుమళ్లుతుండది ? యాతుట్టి భర్తిజేత మంట బయిలెల్లితివి ? అంట అంటుండంగనె నడుంగుల అందుకోని దెబ్బదిన్న నెమిలి పిట్టోలె పున్కు పున్కున జూసుకుంట అమాంతం వురుక్కొచ్చి నన్నల్మకోని వొర్దక్కా ! నన్నంత ఘూటనకు ఈ ఉప్పెన మాటయిన్న కాణ్ణుండి నేను మెడకుతాడేసి గుంజుతున్న యమ బటులెంట పోలేక తండ్లాడుతున్న ప్రాణోలె, గాలానజిక్కి కొనూ పిరితోటి కొట్టుకుంటున్న శాపతీర్గ ఆవలీవల వడ్తుండ. నాలోపట యాదో సెప్పరాని యెత కుమ్మరావం గాలినట్ల కాల్తుండది తల్లి యెచ్చమ్మా ఆని ఎక్కి ఎక్కి ఏడ్వ వట్టింది.

మోన అంటె ఇందాంకా వున్న తక్కువ సూపంత జారిపోంగ నేను ఏంది ? మోన ! లే ! మరీ సిన్నపిల్లతీర్గ ఏడ్సుడేంది ? ఏందో ? చెప్పు అంట కండ్లు దుడ్సి పల్క మంచంమీద నాజతకు కూసుండ వెట్టుకున్న, జర సముదానపడ్డ మోన చెప్పుకం మొదలు వెట్టింది.

అక్కా ! నా పేరు మోహన గాదు, నేను అండాళును.

' ఆఁ! అదేంది ? మోన! నీకు గాలిగీలి సోకలేదు గద ? పైత్యంగిన గమ్మిండే మొ ? నీవు ఆండాలేంది ?'

'లేదు; నాకేరోగంలేదు, నిజంగనెజెప్పుతుండ. మేం వైష్ణవబ్రాహ్మలం; మాఅమ్మా, నాయిన దేవుండ్లసోంటోళ్లు. మావూరు ఏటి అవుతల కిష్ణాపురం. ఈనాటికి సరిగ ఇరువైఏండ్లునాడు ఇట్లె వరుదలొచ్చినయ్.

ఇంగా కొంచెం సేపటికి అంత ముదనష్టం అయిపోతదనంగ మా నాయిన ఆంజనేల గుళ్లదీపారాదన జేసి వొస్తనంట సెల్ల బుజాన ఏస్కున్నడు. అదిచూసిమాయమ్మ

వద్దు, పోకుండి, మొగులు ముంచు కొస్తుండది, ఈదరగాలి ఇసిరి ఇసిరి సంపుతుండది. ఇప్పుడు వానమోపైతే ఇడ్వదు అని వోదిక్కు అంటుండంగనె

దినాం జేసేకైంకర్యం ఈనాడు నాపడికట్టు దప్పి పాపంగట్టుకోమ్మంటవా ? గుళ్ల సందెదీపం ఎలిగిచ్చి, గాలి బిగువు అందుకోని వాన తగుల్కోక ముందె వొస్త నంట నాయిన కడ్పదాటిండు.

ఆయినీట్ల పదిగజాలమేరనడ్సిండో లేదో ? వాన వొక్కమొగిన అందుకోని ఏన్గెతొండ్యాలోలె గుమ్మరిచ్చుడు మొదలు వెట్టింది. దానికితోడు సెవుల గళ్లు వడెటట్ల గాలి వూపివూపి పెట్టవట్టింది. ఇంటెన్కి కారు మల్లె సెట్టిర్గి మా వంట ఇంటి మీదికి వొరుగంగ ? అది బూమి మట్టమైంది.

కడ్పుల పేగులు సుట్టలు జుట్టుకోని నెత్తురు గడ్డ గట్టెటట్ల, సెవులు ఇనికిడిగోలు పోంగ మెర్పులు మెరిసి ఉర్మలు ఉర్మి పిడుగు వడ్డది. ఆదెబ్బకు మా ఎన్కికొంప గూలింది. ఇదంత జూస్తున్న మాయమ్మ తనగతి ఏంది ? అని గాకుండ 'అమ్మో! నాదేవుడు యాడసిక్కువడెనో ? ఏమాయెనో? ఆయున ఎంటనే నేను అంట ' అనుకుంట దైర్నం తోటి నన్నిడ్సు కుంట ఎన్కేసుకోని గుడిదిక్కు వుర్కుతుంటె పెద్ద పాములు బుసగొట్టినట్లసప్పుడొచ్చింది; అంతే ! ఇంగనాకేందెల్వదు. మాయమ్మ ఏమైందో మానాయిన ఏమైండో ?

నాకు మతి దెల్సి కన్నుదెర్సెట్యాళ్లకు నేను నా అసొంటిదిక్కులేని పిల్లల తోటి గల్సి ఉన్న.

ఆటెంక వర్తమానం అందుకున్యసుట్టాలొచ్చి(న్రు. కనికరం వున్నోళ్లు కొందర్ని గొంచవోయి(న్రు.

మరి నన్నెవరు తాకలేదు, గుర్తువట్టలేదు, పట్టకేంది? గని, నానా సేతులు దాకిన కూడు దిన్న నన్ను గొంచ పోతె కులం బోదా ? అదిగా కుండ మానాయిన కూడవెట్టిన ముల్లె ఏముండదని ? నన్ను సాకి వొళ్లవెట్టుకోని సంతరిచ్చెటందుకు ? అందుకనే నేను దిక్కులేని దాన్నైన.

పాపం! దిక్కులేని మా అసోంటోళ్లందర్ని సంఘసేవకపోండ్లొచ్చి ఆదరిచ్చి(న్రు. అంటే సేవ అంట పేరు వెట్టుకున్న మారుబ్యారపు దుకాండ్లల్లకు మేం బోయినం.

నాకప్పటికి పద్నాల్గు పదిహేనేండ్లు, నాకు సదువొచ్చు, గోదాదేవి పాడె తిరుప్పావై పాటలన్ని వచ్చు. పెరు మాండ్ల అలంకారం కోసం తీరు తీరు పూలదండలు అల్లేదాన్ని. స్వామికి ప్రభజరిపేనాడు ఆరంగని ముంగల జడకుచ్చుల కోలాటం ఏసెటోండ్లం. ఇట్ల నాకు ఆట పాటలు చిన్న నాటి.నుండే అబ్బినయ్.

మాదిక్కులేని పిల్లలందరికి ఇప్పుడు రాజామణి, శంకర్రావులు తలి దండ్రి రూపుకంల ఏర్పాటైన్రు. పాపం ఈకొత్త అమ్మ నాయినలు నన్నెందుకో కాయకష్టం జేయ నియ్యక సుకాసిబొమ్మోలె సాకవట్టిన్రు. అదిజూసి నాజతపిల్లలంత నన్ను జూస్తెనె యాదో పరాయి మనిషిని జూసినట్ల ముక్కులూ మూతులూ దిప్పుతుండిరి. ఇట్లరొండేండ్లు గడిసె.

ఓ నాడు ఉన్నట్లుండి వోఅర్ధమ్మరాతిరి వోమోటరొచ్చి నన్ను ఎక్కిచ్చుకున్నది. అంటే వరుదలల్లగొట్కపోంగ తల్లి దండ్రి అంట లేని ఆండాళుకు బ్యారం రొండు వేల రొక్కం బల్కింది.

నేను కొత్త శరుణాలయం జేరిన...

ఈకొత్త శరణాలయంలగుడ నన్ను అపురూపంగనె జూసుకునెటోళ్లు.నా పేరు ఆ నాటి నుంచి 'మోహన' ఆండాళు గాదు.

మా కొత్త చిచ్చకు నేనంటే ఎంతో ప్రాణవార్తికం. దినాం పొద్దుమూకి మా పిల్ల లందరిని పల్కరిచ్చెటందుకు వొచ్చినప్పుడు నన్నూ, చెంద్రను ఏరుగ విల్సి 'పాపలూ!

మీరు మీ పైలకు సబ్బువెట్టుకోకుండి, నాపేరుజెప్పి వోసిన్న గిన్నెల మీగడ పెరుగు అడ్డి దాంట్ల పస్పు గల్పి వొంటికి రాసుకోండి ' అంట జెప్పేటోడు '.ఈమాటయిన్న మేం లోలోపట నగుకుంట సిన్నాయినకు తిక్క వట్టినట్లుండది; దినాం పల్సటి నీళ్ల

మనిషి రూపుకంల వొచ్చి నట్ల కండ్ల వడ్డడు. వచ్చు కం వచ్చు కమె ఆయిన నామీదనె కండ్లు నిల్పి ఏంజేయ లేక నిల్వునీరైండు.

నింద మున్గినంక సలియాండది ? నారక్షణకు అన్ని దిక్కులు మూస్కపోంగ నాకు ఆతోటల్నె సామి సేవకు అంకితమైన దేవదాసి ఎంకట రాజం ఆదెరువైంది. ఇంగ మొదటి సూపుల్నె నామనసూ తనువూ ఈడూజోడూ గల్శిన పూజారి కొడ్కు రమణమూర్తికి ఎత్తు గట్టిన .

పాపం ఎంకటరాజం లోపట సిన్ననాట ఏందోషం, ఏంతప్పు వుండిందో గని ఈనాడు మట్టుకు ఆమె ఏమైల సోకనియ్యకుండ రొండుపూటలా స్వామికి మంగళహారతులు వాడుకుంట గడ్పుతున్న భక్తురాలు . తనకు వొచ్చిన విద్దెల మెర్గులన్ని నాకు నేర్పుకుంట, నాకు తల్లై నన్ను సాకవట్టింది. ఆందికె మీ అక్కయ్య పెండ్లిల్ల ఆనాడు ఆమె గట్టిన మ్యాళంల నేను ఏజంకుగొంకు లేకుండ ఆడి పాడిన. అట్ల ఆజట్టున వున్నందుకు నేనేదో తప్పిదం జేసినట్ల దాక్కోని మొకం దప్పిచ్చాల్శిన పనినాకు లేదు.

పెద్ద పెద్ద మాటలు వల్కి ఎంగిలికూటిల గుడపాత్తు గల్శి పాలువంచుకునే శానా మందికన్న నాకిష్టం లేనిగడ్డిని నానోట్లెగుక్కి ఉత్తతోలు బొమ్మను జేసి ఆడిచ్చక, నా ఆట పాటకు మెరుగువెట్టి జీవనాదారం జూపిన ఆరాజంమిన్న, మిన్నేంది ? ఆమె ముందల ఈదగుల వాజి పెద్దోళ్లంత దిగదుడ్పు.

అమ్మా మీకు దెల్వకుండొచ్చు ఆనాటి నుంచి నాకు మొగుడూ దేవుడు ఆ రమణమూర్తే. మూడుముళ్లేసి నా మెడల పుస్తెగట్టి నా కట్ట కున్న నాబతుకుబాట, నాకండ్ల ఎన్నెల, నాశికెనపువ్వు, నాపాటన రాగం, నా ఆటన తాళం నామొకాన బొట్టు అన్ని ఆయినే! అంట ముగిచ్చి కండ్లు దుడ్సుకోని నీవు బావ ముచ్చెటొచ్చినప్పుడు పొంగుతవు. సూడు అట్ల ముర్సుకుంట పొంగిపోయింది. అప్పుడామొకాన ఎంత ఎలుగనుకున్నవ్ ?

ఈకత ఇంటున్నంతసేపు నేను రొండుమర్శి పటానదింపిన బొమ్మోలె ఉండిన అంటె వ్వము

అక్కా ! మీరే జెప్పుండి ఇంతింత వడ్డనేను ఉప్పెన మాటయినంగనె కదుల్తనా ? లేదా ? ఈ ముదనష్టపు వుప్పెన మర్పునవడ్డ రూపులనూ, గడిసిపోయిన బతుకును సుళ్లానాకండ్ల ముంగల కదులాడ జేసింది. ఆకడగండ్లన్ని నాతోటి పరాశ్కం ఆడు కుంట నా నరాలను పిండు కుంట ఎక్కిరిస్తున్నట్ల నిపిచ్చింది.

వరద లొచ్చినప్పుడు తలి దండ్రితోపాటె ఆడివిల్లంత గొట్కపోతె యాతంట వుండదు గని, అందరువోంగ మొండి ఆయిస్సు వోస్కొని నా అసోంటోళ్లు మిగిల్తె వాళ్ల గతి ? మళ్లా దర్మ సంగాలు, సేవా సదునాలు, శరణాలయాలు, బ్యారాలు, బోగపు బత్కులు, చింపిన ఇస్తార్లు, తల్సు కుంటెనె పై ముల్లేస్తది. ఆదిక్కులే నిపిల్లల దల్సుకోని నాబత్కులెనె బజారుపాలైతె ఎట్ల అంట బుగులు జొచ్చి నీకాడ్కివొచ్చినగని నాకు యాసిక్కా దెల్వదు, యావుడ్తలేదు. అంట జెప్పి దబ్బున మీదికి లేసింది.

అట్లనిలవడ్డ మోననుజూస్తె నాకండ్లముంగల నిలవడ్డ మనిషి వుత్తుత్త మనిషి గాదు, మనందరి కన్న ఎంతో ఎత్తున వున్న దేవుత అసొంటిది, ఇందాక ఆమె సున్నితమైన మనస్సును సూదు లసోంటి మాటల్తోటివొడ్సిన. సేయరాని తప్పిదం జేసిన అంట గ్రహిచ్చుకోని మోనసేతులు వట్టుకోని ''మోనా తప్పు వట్టుకోకు, ఇంత ఎతను ఎదలదాస్కొని అంటూ సొంటు లేకుండ మెదుల్తున్న నీకు మొక్కాలె. ముత్తెమ సొంటి మనుసున్న నీవు దేవుడవే ! బుగులు వట్టకు ఈత్యాప పిల్లలు బద్దరంగవుంటరు. సేవాసదునాలుగిన ఎన్కటి తీర్గ తప్పుడు పనులు జేయకుండ మనందురం సూతం'' అంట సముదాయించి తోలిన. ఇదీ కత.-

నీవే మంటవో గని, ఉత్తరం రాయి.